తెలుగు కళా సమితి(న్యూజెర్సీ)ఉగాది మినీకథల పోటీలో

రు. 300 గెలుపొందిన రచన

# స్వయంకృతం



దేవవరపు నీలకంఠరావు

ఎల్లారెడ్డిని జోగినాథం తన ఇంట్లో బంధించాడనే వార్త ఊరంతాగుప్పుమంది. ఆ ఊళ్ళో ఎక్కడ విన్నా, ఎవరు గుమి కూడినా అందరికీ ఇదే విషయం చర్చ నీయాంశం అయింది.

అయితే ఏవిటా వింత?

దుర్యోధనుడు కర్ణుడ్ని యుద్ధభూమికి వెళ్ళొద్దని తన కోటలో బంధించాడంటే అది ఎంత వింత విషయమో ఇది కూడా అంతే వింత వార్త! ఎంచేతంటే-

జోగినాథానికి ఎల్లారెడ్డి ఆరో ప్రాణం. ఇద్దరిదీ శరీరం వేరు తప్ప మాట- మనసు- మనుగడ ఒకటే! ఆ ఇద్దరిలో ఒకరు లేనిదే మరొకరు లేరు. కాళిదాస మహాకవి 'వాగర్థావివసంపృక్తౌ' అన్నట్టు ఆ ఇద్దరిలో ఒకరు 'శబ్దం' అయితే మరొకరు దాని 'భావం'! అలాంటి ఎల్లారెడ్డిని జోగినాథం బంధించాడు.

పైగా ఇది మామూలు సందర్భం కాదు. ఎన్నికల సమర సంరంభ సమయం! జోగినాథం భవిష్యత్తు రాజకీయ రంగంలో 'కాంతి పుంజం' గానో 'చీకటి గోళం'గానో మలుపు తిరగ బోయే అమూల్య దినం.


లేకలేక ఇన్నాళ్ళకు ఇన్నేళ్ళకు జోగినాథంఆ ఊరి పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ పదవికి పోటీ చేశాడు. అలాగని అతనికి రాజకీయ జీవితం ఈనాటి నుండే ప్రారంభం అయిందనుకుంటే అది పొరపాటు. ఎప్పటినుండో రాజకీయ రంగంలో అతను నేపథ్య కళాకారుడు! హీరో- విలన్ల మధ్య సంకుల సమరాన్ని సృష్టించే గ్రంథకర్త! స్వపక్షం పాలిట శకుని- పరపక్షం పాలిట శల్యుడు.

అలాంటి జోగినాథాన్ని నేపథ్యం నుండి బయటికి తీసుకొచ్చి రంగంపై నిలబెట్టిన వాడు ఎల్లారెడ్డి. దర్శకుడిపై కన్న నటుడిపైనే ప్రేక్షకులకు ఎక్కువ గురి ఉంటుందనే యథార్థాన్ని గమనించిన ఎల్లారెడ్డి తన మిత్రుణ్ణి ఎన్నికలలో పోటీ చేయవలసిందిగా కోరాడు. 'కోరాడు' అనడం కంటే శాసించాడనడం మంచిది. అ దంతా మిత్రునిపై

# రచయిత స్వపరిచయం

తూర్పు గోదావరి జిల్లాలో పుట్టిన నేను త్వరలో ముప్పై రెండో గ్రీష్మాన్ని చూడబోతున్నాను. పొన్నూరు (గుంటూరు జిల్లా)లో భాషా ప్రవీణ చదివి, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి తెలుగులో ఎం.ఎ. డిగ్రీ పొంది, ప్రస్తుతం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, మామిడికుదురు (తూ.గో. జిల్లా)లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నాను. నేను రాసిన నాలుగు నాటికలు, ఒక నాటకం ఆకాశవాణి ద్వారా ప్రసారం అయ్యాయి. ఇంకా కార్టూన్లు, కథలు, కవితలు, నాటకాలు వగైరాలు రాసినప్పటికీ బహుమతి పొందడం అనేది ఇదే ప్రథమం.

చిత్రకళ, రచనా వ్యాసంగాలు నా అభిమాన విషయాలు. రచన ప్రాచీనమైనా, ఆధునికమైనా రసానుభూతిని కలిగించేదైతే చదవాలనిపిస్తుంది. పాఠకుడి మనసును స్పందింపచేసే రచన చేయాలని తపన.



—దేవవరపు నీలకంఠరావు, మామిడికుదురు

అతని కున్న అభిమానమే తప్ప మరేం కాదు.

ఆఖరికి స్నేహితుడి మాట కాదనలేక నామినేషన్ వేశాడు జోగినాథం. నామినేషన్ అంటూ వేస్తే ఆ ఊళ్ళో తమకిక పోటీయే ఉండదని వాళ్ళ అభిప్రాయం. కాని అలా జరగలేదు.

ప్రతిపక్షం వాడు తన నామినేషన్‌ని ఉపసంహరించుకుంటాడనే ధైర్యం చివరి క్షణంలో క్షీణించడంతో జోగినాథానికి తన 'ప్రతిభ'పై తనకే కోపం వచ్చింది. ఆ కోపం ఒక ఛాలెంజ్‌గా మారింది.

నామినేషన్ వేయించడం దగ్గిర నుంచి ప్రచారం పూర్తయ్యేవరకు ఎల్లారెడ్డి నిర్వహించిన పాత్ర సాటి లేనిది. స్నేహితుడు నెగ్గడం కోసం అతను పడిన పాట్లు చెప్పలేనన్ని! ఓటు వేయమని ఓటర్లని అభ్యర్థించేటప్పుడు ఎల్లారెడ్డి నిజంగా బలిచక్రవర్తి ముందు వామనుడే అయ్యాడు. తన వ్యక్తిత్వాన్ని కూడా వదులుకొని యాచించాడు. అవసరమనుకున్న చోట రాక్షసుడై హెచ్చరించాడు.

నాల్గు రోజుల క్రితం ప్రతిపక్షంతో జరిగిన కొట్లాటలో దెబ్బలు కూడా తిని కట్లు కట్టించుకున్నాడు. స్నేహితుణ్ణి గెలిపించి తీరతానని బహిరంగంగా జబ్బచరిచి సవాల్ చేశాడు. అందుకోసం ఏ ఒక్క ఓటును పోనీయకుండా చేసేందుకు తన శాయశక్తులా రేయింబవళ్ళు కష్టపడ్డాడు.

ఆ ఊరి ఓటర్ల లిస్టులో పేరు నమోదై వుండి కారణాంతరాల వల్ల గ్రామాంతరాలు పోయిన వాళ్ళందరిని ఎంతో సొమ్ము ఖర్చుపెట్టి, కార్లలో ఎక్కించి తీసుకొచ్చాడు. డబ్బును మంచినీళ్ళ కన్నా తేలికగా వెదజల్లాడు.

జోగినాథం, తనపై ఎల్లారెడ్డికిగల ఈ అస్ఖలిత ప్రేమాభిమానాలకు ముగ్ధుడై అతన్ని మనసారా కౌగిలించుకొని, పోటీలో పేరు తనదైనా గెలుపు ఓటమిలు నీవే' నన్నాడు.

ఎన్నికల రోజు రానే వచ్చింది. ఇరుపక్షాలలోను పట్టుదలలు తారాస్థాయికి చేరుకున్నాయి. పోలింగ్ ప్రారంభం అయింది.

అదే రోజు ఉదయం సరిగ్గా ఎనిమిది గంటలకు జోగినాథం ఎల్లారెడ్డిని తన గదిలో బంధించాడు!

ఈ విషయం ఊరంతా అట్టుడికి పోయింది.

ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవడం కన్న ఈ విశేషాన్ని ముచ్చటించుకోవడంలోనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. జోగినాథం అంతర్యం ఏమిటో ఎవరికీ అర్థం గావడం లేదు.

ఇంతకన్నా గొప్ప విషయం మరొకటి వుంది.

ఎందరో ఓటర్లు పోలింగ్ బూత్‌కి వచ్చి ఓటు వేసి వెళ్ళి పోతున్నారు. ప్రతిపక్షం వాళ్ళు కూడా వచ్చి తమ ఓటును వినియోగించుకుని వెళ్ళిపోయారు. కాని జోగినాథం మాత్రం ఆ రోజు పోలింగ్ కేంద్రంలో అడుగు పెట్టలేదు!

మధ్యాహ్నం రెండు గంటలైంది. పోలింగ్ బూత్ దగ్గర జనం కొంచెం పలచబడ్డారు.

మూడు గంటలైంది!

రెండు పక్షాల నాయకుల స్త్రీ కుటుంబ సభ్యులు కూడా వచ్చి ఓటు వేసి వెళ్ళిపోయారు.

మూడున్నర అయింది.

జోగినాథం మాత్రం రాలేదు. ఎల్లారెడ్డిని విడుదల చేయలేదు.

నాలుగైంది. పోలింగ్ పూర్తయింది. బ్యాలెట్ బాక్సులు సీలు చేయబడ్డాయి.

సరిగ్గా అప్పుడు జోగినాథం 'అమ్మయ్య!' అనుకుంటూ తన గది తలుపులు తెరిచాడు. బోనులో బంధింపబడిన పులిలాగ ఎల్లారెడ్డి బయటపడ్డాడు. అతని ముఖ కవళికలలో ఆవేశంపొగలుకక్కుతుంది. గుండెలు నిక్కబొడిచి, ఎర్రబడ్డ కళ్ళతో తన మిత్రుడివైపు చూశాడు. ఆ చూపులో ఒకే ఒక ప్రశ్న–

'ఎందుకిలా చేశావ్?'

"ఆవేశ పడమాక. ఇదంతా సెయ్యాలనే సేసినా" నవ్వుతూ అన్నాడు జోగినాథం.

"ఎందుకు?"

"నీ ఉత్సాహం నాకు తెలుసు. నిన్ను ఇడిసిపెట్టి వుంటే నేనెంత వారించినా ఇనకుండా నువ్వునాకు ఓటేసే వోడివి. అందుకే నిన్ను బంధించాను!"

అర్థంగాని ఎల్లారెడ్డి అయోమయంగాచూశాడు.

"అంతే కాదు, నేను కూడా నా ఓటు ఏసుకోలేదు!"

ఈసారి ఎల్లారెడ్డికి తల తిరిగినట్లయింది.

"ఎందుకో తెలుసా? మనిద్దరం గతంలో ఎన్నో ఎలచన్లు సూసినాం. మనం ఓటేసిన ఏ పార్టీ కూడా ఎప్పుడూ నెగ్గలేదు. పైగా మనిద్దరం జ్యేష్ఠ నక్షత్ర జాతకులం. అందుకే మన చేతి ప్రభావం నాకు తెలుసు గాబట్టి మన ఓట్లు మనకి పడకుండా జాగర్త పడినా"

"పోనీ ఎగస్పార్టీకి ఏసేవోళ్ళంగా" అంటూ గుర్రుగా చూశాడు ఎల్లారెడ్డి. "నే జేతులా మన ఓట్లు ఆ యెదవల కెలా ఏత్తాం?"

ఆ మాటకి ఏం సమాధానం చెప్పాలో ఎల్లారెడ్డికి తోచలేదు. పెల్లుబికిన ఉత్సాహం- ఉద్రేకమై- జోగినాథాన్ని ముంచెయ్యాలనుకున్న వాడల్లా ఆ మాట వినేసరికి చప్పబడిపోయాడు.

"నువ్వేం బాధ పడమాక. గెలుపు మందే!" అని మిత్రుణ్ణి ఓదార్చాడు.

మర్నాడు ఓట్ల లెక్కింపు ప్రారంభం అయింది. గంట గంటకు బలాబలాల లెక్కలు ఉద్రేకాన్ని కలిగిస్తున్నాయి. ఇరుపక్షాలు సుమారు అటుయిటుగ కొద్ది తేడాలో పరుగెడుతున్నాయి.

లెక్కింపు పూర్తయింది. ఫలితం ప్రకటించారు.

జోగినాథం ఒక్క ఓటుతో ఓడిపోయాడు.

ప్రతిపక్షం వాళ్ళు చెలరేగిన సముద్రంలా ఉత్సాహంలో కేరింతలు కొడుతున్నారు.

వ్యర్థమై కాలంచెల్లిన ఆ రెండు ఓట్లు మాత్రం కళ్ళు తేలేసి విశ్వలంగా ఉండిపోయాయి నిస్తేజంగా!

